క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి

కౌతాళం: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ హాజరయ్యారు. ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ ఎంతో కీలకమైనదని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కొనసాగిస్తే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకుంటారని చెప్పారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ప్రణాళికబద్ధంగా చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధ్యాపకులు పాల్గొన్నారు.

టీబీని అంతమొందిద్దాం



టీబీపై అవగాహన కల్పిస్తున్న బాబురాజు


ఆదోనిటౌన్ : 2024 నాటికి క్షయవ్యాధి(టీబీ)ని అంతమొందించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు తెలిపారు. శుక్రవారం 27వ వార్డు బి.ఎస్. రోడ్డులోని మాక్ సెంటర్‌లో టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2021 నుంచి 2023 వరకు మూడేళ్ల పాటు క్షయవ్యాధిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం, ఖరీదైన మందులు ఇవ్వడంతో పూర్తిస్థాయిలో వ్యాధి తగ్గుముఖం పట్టిందన్నారు. 2024 నాటికి దేశంలో ఎక్కడా వ్యాధి ఉండకూడదనే లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. రెండు వారాలకు మించి దగ్గు, గళ్లలో రక్తపుచారలు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఉదయం, సాయంకాలం జ్వరం రావడం వ్యాధి లక్షణాలని చెప్పారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రోడ్డులో ఇరుక్కుపోయిన ఇసుక లారీ



కోసిగి: మండల కేంద్రం నుంచి హాల్వి గ్రామానికి వెళ్లే రోడ్డులో భారీ లోడ్‌తో వస్తున్న ఇసుక లారీ గుంతలో ఇర్కుపోయింది. శుక్రవారం మధ్యాహ్నం కౌతాళం మండలం గుడికంబాలి ఇసుక రీచ్ నుంచి ఇసుకను కర్నూలు తరలిస్తున్నారు. హాల్వి సమీపంలో రోడ్డు గుంతగుంతలు పడి ఉండడంతో ఇసుక లారీ ఇరుక్కుపోయింది. దాదాపు గంట పాటు నిలిచి పోవడంతో వాహనరాకపోకలు అంతరాయం ఏర్పడింది. పక్కనే ఉన్న జేసీబీలో లారీలో ఉన్న ఇసుకను కిందకు వేసి లారీని బయటు తీయడంతో లారీ బయటకు రావడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పాయి.

పెట్రోల్ బంక్ తనిఖీ



హొళగుందలో పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దారు హుసేన్‌సాహెబ్

హొళగుంద: హొళగుంద శివారు ఎల్లార్తి రోడ్డులో హనుమంత రెడ్డి పెట్రోల్ బంక్‌ను శుక్రవారం తహసీల్దారు హుసేన్‌సాహెబ్ తనిఖీ చేశారు. బంకులో పెట్రోల్ నాణ్యత, కొలతలు, అమ్మకపు ధరలు, టాయిలెట్స్ ఉన్నాయా? అని పరిశీలించి ఇతర వివరాలను తెలుసుకున్నారు. బంకుకు వచ్చిన వాహనదారులను నాణ్యత తదితర వాటి గురించి ఆరా తీశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పెట్రోల్ అమ్మాలని నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేశారు. వాహనదారులకు కొలతలు సక్రమంగా ఉండి నాణ్యమైన పెట్రోల్, డీజిల్ విక్రయించాలని బంకు నిర్వాహకులకు సూచించారు. అలాగే మిగతా బంకులను తనిఖీ చేయనున్నట్లు తహసీల్దారు వెల్లడించారు. డీటీ ముకుందరావు వెంట ఉన్నారు.

పన్ను వసూళ్లు భేష్

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక పురపాలక సంఘ పరిధిలో పన్నుల వసూళ్లలో జిల్లాలోనే ఎమ్మిగనూరు మొదటి స్థానం సాధించినట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్థానిక కార్యాలయంలో వార్డు అడ్మిన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.3.99 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.2.87 కోట్లు వసూలు చేసినట్లు పేర్కొన్నారు.

నిఘా కళ్లు కప్పి..

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా.. పోలీసుల దాడులు ముమ్మరంగా ఉన్నా.. డేగ కళ్లను గప్పి కర్ణాటక మద్యం ఏరు దాటుతూనే ఉంది. మద్యం మాఫియా విచ్చలవిడి కారణంగా ప్రతి పల్లెల్లోనూ కర్ణాటక చీప్ చిందులేస్తోంది. గ్రామ సంబరాల్లో ప్రధాన భూమిక టెట్రా ప్యాకెట్లదే. ఊరి దేవర్లు, ఉరుసుల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

- ఏరు దాటుతున్న కర్ణాటక మద్యం
- దేవర్లు, ఉరుసుల్లో టెట్రా ప్యాకెట్ల జోరు
- జోరుగా విక్రయాలు



అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్న కోసిగి సెబ్ పోలీసులు (ఫైల్)

మంత్రాలయం: కర్ణాటక చీప్ లిక్కర్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటూనే ఉంది. రాత్రి గస్తీలు తిరుగుతున్నా.. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా అడ్డదారుల్లో కర్ణాటక టెట్రా ప్యాకెట్లు తరలిస్తున్నారు. మంత్రాలయం మండలం మాధవరం, కౌతాళం మండలం బాపురం దగ్గర చెక్‌పోస్టు లు ఏర్పాటు చేశారు. ఆ దారులను కాదని పొలాల దారుల నుంచి మద్యం పల్లెలను చేరుకుంటోంది. నదీ పరివాహక గ్రామాలు నదిచాగి, గుడి కంబాళి, తుంబిగనూరు సాతనూరు, ఆర్డీఎస్ ఆనకట్ట, నది కైరవాడి, జోహరాపురం, రౌడూరు గ్రామాల పొలాల దారుల్లో తరలిస్తున్నట్లు సమాచారం.

ఏడాదిలో పట్టుబడిన కర్ణాటక మద్యం, కేసుల వివరాలు

పోలీస్ స్టేషన్	కేసులు	నిందితులు	మద్యం	వాహనాలు
సెబ్ కోసిగి	259	242	6,461లీటర్లు	26
సివిల్ కోసిగి	26	39	2.158 లీటర్లు	2,567
మంత్రాలయం	150	130	3,533 లీటర్లు	68
మాధవరం	350	512	5,353 లీటర్లు	106

ముమ్మరంగా దాడులు..

కర్ణాకట మద్యాన్ని పూర్తిగా రూపుమాపేందుకు సెబ్, సివిల్ పోలీసులు గట్టిగానే శ్రమిస్తున్నారు. ఉన్నతాధికారుల నేతృత్వంలో ప్రత్యేక నిఘా సైతం పెట్టారు.నియోజకవర్గంలోని మంత్రాలయం, మాధవరం, కోసిగి, కౌతాళం సివిల్ పోలీస్ స్టేషన్లతోపాటు కోసిగి, ఎమ్మిగనూరు, ఆదోని సెబ్ బలగాలు ఇదే పనిగా దాడులు చేస్తున్నారు. నదీ తీర గ్రామాల ఇన్‌చార్జ్ కానిస్టేబుళ్లు, సచివాలయం పోలీసు సిబ్బంది నుంచి సమాచారం తీసుకుంటూ మద్యం ముఠాల ఆట కట్టిస్తున్నారు. అయినా ఊరి సంబరాల్లో టెట్రా ప్యాకెట్ల జోరు తగ్గడం లేదు. గతంతో పోలిస్తే ప్రస్తుతం కర్ణాటక సారా ప్రవేశానికి కళ్లెం వేశారు.

ఇలా చేస్తే..

రాత్రి గస్తీలు ముమ్మరం చేయడంతో పాటు నదీ తీర గ్రామాల పొలం దారులపై ప్రత్యేక నిఘా పెంచాల్సి ఉంది. గ్రామ ఇన్‌చార్జ్ పోలీసులు సీరియస్‌గా పనిచేస్తే టెట్రా ప్యాకెట్లు బయటకు రావు. మూలాల నుంచే మద్యం తరలింపును అరికట్టాల్సి ఉంది. కర్ణాకట మద్యం ప్రవేశంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతోపాటు చీప్ లిక్కర్‌తో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది.

ప్రత్యేక నిఘా పెట్టాం



తుంగభద్ర నది తీర ప్రాంత గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. కర్ణాకట మద్యం రవాణాను దాదాపుగా తగ్గించాం. ఇటీవల పట్టుబడిన వాహనాలకు వేలం వేయగా స్టేషన్ తరపున ప్రభుత్వానికి రూ.15 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. రోజూ తమ కానిస్టేబుళ్లు గ్రామాల్లో బీట్ నిర్వహిస్తున్నారు. పల్లెల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు వివరిస్తున్నాం.

– సృజన్‌బాబు, సెబ్ సీఐ, కోసిగి

మద్దతు ధరతో జొన్న కొనుగోళ్లు

చిప్పగిరి: ప్రభుత్వ సూచనల మేరకు మద్దతు ధరతో రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేస్తామని ఆర్డీఓ మోహన్‌దాస్ తెలిపారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని రామదుర్గం, నగరడోణ తదితర గ్రామాల్లోని రైతులకు జొన్నల కొనుగోలు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో పండించిన 51 రకం జొన్నలకు క్వింటాలుకు రూ.2,970 ప్రకారం ప్రభుత్వం ధర నిర్ణయించిందని తెలిపారు. ఎలాంటి తరుగు, కమీషన్ ఉండదని చెప్పారు. జొన్నలు విక్రయించాలనుకునే రైతులు స్థానిక ఆర్బీకేలో సంప్రదించాలని సూచించారు. తహసీల్దారు లక్ష్మీనారాయణ, వీఆర్‌ఓ మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు సరైన పోషకాహారం తీసుకొంటే రక్తహీనతను నివారించవచ్చని స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో రెడ్‌రిబ్బన్ క్లబ్, పెద్దకడుబూరు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థుల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తెలుసుకునేందుకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిమోగ్లోబిన్ శాతం పెరిగేందుకు అందుబాటులో దొరికే ఎండు ఖర్జూరం, ద్రాక్ష, వేరుశనగతో కలిపి బెల్లం, ఆకుకూరలతో కూడిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యులు పరిమళ, సునీత పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు, సమావేశంలో పాల్గొన్న అధికారులు

కర్నూలు కల్చరల్: నేషనల్ హైవేలపై (ఎన్‌హెచ్) ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓర్వకల్ వద్ద అండర్ పాస్‌నిర్మాణానికి సంబంధించి డిజైన్స్ ఎస్టిమేషన్స్ పనులు, సంతోష్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద ఐరన్ బ్యారికేడింగ్ పనులు, ఫ్లైఓవర్ మధ్యలో టూవీలర్స్ ప్రవేశించకుండా చేయాల్సిన పనులు, సంతోష్‌నగర్ నుంచి మానస డాబా వరకు సోలార్ లైట్స్ ఏర్పాటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బళ్లారి చౌరస్తా ప్రాంతంలో రహదారుల విస్తరణ పనుల టీడీఆర్ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు. నగరంలో సీసీ కెమెరాల మరమ్మతులు త్వరగా చేయాలని ఆదేశించారు. ఐఆర్‌ఏడీకి సంబంధించి ఈడీఏఆర్‌గా మార్పు చేయడం జరిగిందని, ప్రమాదాలకు గురైన వారిని ఆరోగ్యశ్రీ కింద సేవలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ప్రయాణికులు ఎవరైనా ప్రమాదానికి గురైన కూడా ఆరోగ్యశ్రీ కార్డు లేకున్నా వారికి అత్యవసర వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. నగరంలో ప్రస్తుతం పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులు మాత్రమే తిరగడానికి అనుమతి ఇచ్చామన్నారు. సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, ఆర్టీవో రమేష్, ఆర్టీసీ, మున్సిపల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

రమణీయం.. గంగాభవాని రథోత్సవం







ప్రత్యేక అలంకరణలో గంగాభవాని, రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, అశేష భక్తజనం మధ్య కదులుతున్న రథం

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబళం పంచాయతీ మజరా గ్రామమైన బాపురంలో వెలసిన శ్రీ గంగాభవాని రథోత్సవం శుక్రవారం రమణీయంగా సాగింది. తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకులు అమ్మవారికి మహాగణపతిపూజ, గంగ పూజ, ఆకుపూజ, కుంకుమార్చన, తులసీ ఆర్చన, పుష్పార్చన, పంచామృతాభిషేకము, మహామంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంతో పాటు చుట్టుపక్కనున్న చిన్నతుంబళం, హాళికన్వి, బసలదొడ్డి, కల్లుకుంట, ముచ్చగిరి, నాగులాపురం, సింగరాజనహల్లి తదితరు గ్రామాల నుంచి ప్రజలు పిండివంటలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ముందుగా ఉప్పరి ఈరన్న ఇంటి నుంచి పూర్ణకుంభాన్ని మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి రథం వద్ద ఉంచి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని, ఆలయ పీఠాధిపతులు బసవలింగమ్మ అవ్వను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అమ్మవారిని రథంపై అధిష్ఠింపజేసి మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, కరతాళ ధ్వనుల మధ్య ఆడపడుచులు కళశాలతో స్వాగతం పలుకుతుండగా రథాన్ని ముందుకు లాగారు. తేరుబజారు నుంచి బసవన్న గుడివరకు లాగి యథాస్థానానికి చేర్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, సింగిల్‌విండో అధ్యక్షుడు రవీంద్ర, గొర్రెలఫెడరేషన్ డైరెక్టర్ యల్లప్ప ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కర్ణాటక భక్తుల పాదయాత్ర..

రథోత్సవం పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లాకు చెందిన అమీన్‌గడ, పోత్‌నాళ్, ఆనూరు, మాన్వీ తదితర గ్రామాల భక్తులు రెండు రోజుల ముందు నుంచే బాపురం గ్రామానికి పాదయాత్రగా బయలుదేరి శుక్రవారం చేరుకొని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా మహా రథోత్సవం



జూటూరులో భక్తజన సందోహం మధ్య సాగుతున్న స్వామి వారి రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలో శుక్రవారం సాయంత్రం మహాలింగేశ్వర స్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకీలో తీసుకొచ్చి రథంపై ఆశీనులు చేయగానే రథం ముందుకు కదిలింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్ఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

జాతరను పురస్కరించుకొని నిర్వహించిన కబడ్డీ పోటీలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీలను స్నేహపూర్వకంగా తీసుకోవాలని సూచించారు. గెలుపోటములు సహజమని, ఆటల వల్ల ఆరోగ్యంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని తెలిపారు. పోటీల్లో 30 జట్లు పాల్గొంటున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు.

వైభవంగా సంజీవరాయుడి రథోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని జూటూరు గ్రామంలో వెలసిన సంజీవరాయుడి రథోత్సవం శుక్రవారం కనులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం రథాంగ హోమం, బలిహరణ పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి రథాన్ని భక్తులు లాగారు. రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు దాతలు అన్నదానం ఏర్పాటుచేశారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ మురళీమోహన్, ఎస్ఐ గోపాల్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తులకు అన్నదానం

హొళగుంద: హొళగుంద సమీపంలోని వరబసవేశ్వర స్వామి, కోగిలతోట గ్రామంలోని గాదిలింగప్ప తాత అలయాల వద్ద శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలు అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాలహర్వి మండలం గూళ్యం గాధిలింగేశ్వర స్వామి జోడు రథోత్సవానికి తరలివెళ్తున్న భక్తుల కోసం ఈ కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భారీ సంఖ్యలో భక్తులు జాతరకు తరలి వెళ్లారు. వారికి అన్నదాన శిబిరంలో భోజనం, తాగునీరు. సేద తీరడానికి నీడ తదితర వసతులను కల్పించారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: ఓపెన్ విధానంలో ఇంటర్మీడియెట్ కోర్సు పూర్తి చేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియట్ చదువుతూ మధ్యలో ఆపేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేసి ఆ నకళ్లను కళాశాలలో ఇవ్వాలని సూచించారు.

మంత్రి ఇంట విషాదం



మృతిచెందిన త్రివేణి (ఫైల్)

ఆలూరు: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత నారాయణస్వామి సతీమణి త్రివేణి (40) అనారోగ్యంతో బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చిక్సిత పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఏపీకి నూతన గవర్నర్‌గా నియమితులైన జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు రెండు రోజుల క్రితం వెళ్లిన మంత్రి గుమ్మనూరు జయరాం విషయం తెలుసుకుని వెంటనే బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. త్రివేణి అకాల మరణం చెందడంపై పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. నేడు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఘనంగా ఉరుసు

ఆదోని రూరల్ : మండలంలోని నారాయణపురం –చాగి రహదారిలో వెలిసిన పిరాన్‌పీర్ మాబుసుభాని బాబా 11వ ఉరుసు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 7 గంటల సమయంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు ప్రత్యేక పూజలు చేశారు. వారిని దర్గా నిర్వాహకులు సన్మానించారు. శనివారం జియారత్ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



దర్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థిని పాఠ్యాంశంపై ప్రశ్నిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

పెద్దకడుబూరు : పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల తనిఖీల్లో భాగంగా పెద్దకడబూరులోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ప్రతి తరగతి గదిలోకి వెళ్లి ఉపాధ్యాయుల బోధన తీరును గమనించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్యసాయం కోసం అహర్నిశలు కృషి చేయాలని అక్కడే ఉన్న వైద్య సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ వీరేంద్రగౌడ్, ఎంపీడీఓ రమణప్ప, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చెత్త కుప్పలో పసికందు మృతదేహం



మృతదేహాన్ని చూపుతున్న స్థానికులు

ఆదోని అర్బన్ : ఏ కష్టం వచ్చిందో ఆ తల్లికి నెలలు నిండని ఓ పసి కందును చెత్త కుప్పలో పారేసింది. నెలలు కూడా పూర్తి కాని పసిగుడ్డును ఓ కవర్‌లో చుట్టేసి స్థానిక షరాఫ్‌బజార్ సమీపంలో చెత్తకుండీలో పడేశారు. కుక్కలు పీక్కుతింటుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఎస్ఐ ప్రహ్లాద్ అక్కడికి చేరుకుని పసికందు మృతదేహాన్ని చూసి సంబంధిత వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బందికి సమాచారం చేరవేశారు. వారు వచ్చి మృతదేహాన్ని ఖననం చేశారు. నెలలు నిండకపోవడం, కుక్కలు పీక్కొని తినడంతో లింగనిర్ధారణ చేయలేకపోయారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ

క్రైం కార్నర్

ఆదోని రూరల్ : పట్టణంలోని జాలిమంచి క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం తనిఖీలు చేపట్టగా పెద్ద తుంబళం గ్రామానికి చెందిన వి.లక్ష్మి, గోవిందరాజులు తమ చేతి సంచుల్లో మొత్తం 91 ఓసీ డీలక్స్ విస్కీ ప్యాకెట్లు (కర్ణాటక మద్యం) తరలిస్తూ పట్టుబడ్డారని సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో పీసీలు శ్రీనివాస్, సుధాకర్, ముని పాల్గొన్నారు.

కుంబళనూరులో హుండీ సొమ్ము చోరీ



హుండీని బద్దలుకొట్టిన దృశ్యం

కౌతాళం: మండంలోని కుంబళనూరు గ్రామంలో వెలసిన జడేమల్లయ్య దేవాలయంలో హుండీలోని సొమ్ము చోరీకి గురినైట్లు స్థానికులు శుక్రవారం గుర్తించారు. ఆలయంలో ఉన్న హుండీని తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి అందులోని వెండి,కొంత నగదును అపహరించుకెళ్లారు. గురువారం హాల్విలోని రామకవ్వ ఆలయంలో హుండీ చోరీ చేసి 24 గంటలు గడవక ముందే ఇక్కడ కూడా అలాంటి చోరీ చోటు చేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన బస్సు

- వ్యక్తి మృతి



మృతిచెందిన మేకల సురేష్

ఆదోని రూరల్ : ఆదోని–ఎమ్మిగనూరు రహదారిలోని నెట్టేకల్ క్రాస్ రోడ్డు సమీపంలో ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. తాలూకా ఏఎస్ఐ మోహన్‌కృష్ణ తెలిపిన వివరాల మేరకు..కర్నూలు డిపో–2కు చెందిన (ఏపీ39 టీఈ5775) అనే నంబర్ గల బస్సు ఆదోని నుంచి కర్నూలుకు వెళ్తుండగా ఎమ్మిగనూరు నుంచి బైక్‌పై ఆదోని వైపు వస్తున్న మేకల సురేష్ (29)ను బస్సు డ్రైవర్ ఎర్రమల అజాగ్రత్తగా నడపడటంతో ఢీకొట్టాడు. దీంతో సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కృష్ణగిరి: మండల పరిధిలోని లాల్‌మాన్‌పల్లె గ్రామ సమీపంలో ఈద్గా వద్ద అక్రమంగా కర్ణాటక మద్యాన్ని కలిగిఉన్న గ్రామానికి చెందిన ఉప్పరి మనోహర్, తెలుగు కృష్ణను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వీరి వద్ద నుంచి 20 ఒరిజినల్ చాయిస్ విస్కీ, 90 ఎంఎల్ పరిమాణం గల 30 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.